తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

ఆదివారం 11-10-2026 సంపుటి : 01 సంచిక : 69 పేజీలు : 4 వెల : రూ 2-00

కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, శ్రీకాకుళం, విజయవాడ, హైదరాబాద్.

ఏపీలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

అమరావతి, అక్టోబరు 10 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు (శనివారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను ఆమోదించారు.

సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ...

కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు వెల్లడించారు. డెడికేటెడ్ సిఫార్సుల మేరకు అర్బన్, రూరల్ ప్రాంతాలకు నిర్దేశించిన విధంగా యూనిట్ల వారీగా రిజర్వేషన్లను అమలు చేసేందుకు మంత్రిమండలి అంగీకరించిందని తెలిపారు. ఒక్క జెడ్పీ చైర్ పర్సన్లు మినహా మిగిలిన అన్ని పదవులకూ బీసీలకు 24 శాతానికి మించి రిజర్వేషన్లు వర్తింప చేసేలా రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను చేసినట్లుగా వివరించారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ... నిబంధనలను పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మేలు చేసేలా రిజర్వేషన్లు అమలు చేస్తామని మంత్రులు ప్రకటించారు.

బీసీ రిజర్వేషన్ల వివరాలిలా..

గ్రామ వార్డు మెంబర్లకు-26.73 శాతం, సర్పంచులకు-27.95 శాతం, ఎంపీటీసీలకు-25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు-24.60 శాతం, జెడ్పీ చైర్ పర్సన్లకు-23.08 శాతం, అర్బన్ వార్డు మెంబర్లకు-32.78 శాతం, మున్సిపల్ చైర్మన్లకు-33.02 శాతం, మేయర్లకు-35.29 శాతం మేర బీసీ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీనుకున్నారు. ఈ సిఫార్సులను అమలు చేస్తూ చట్టపరంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని... అన్ని రకాల పదవుల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల ఫలితాలను బీసీలకు దక్కేలా కూటమి పార్టీల పరంగా సీట్లు ఇస్తామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో అమలు చేసిన దానికంటే మెరుగ్గా బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేసేలా తమ కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రులు పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు ఏపీ వాటర్ మ్యాన్..

కృష్ణా డెల్టా రైతుల ప్రశంసలు



అమరావతి, అక్టోబరు 10: పట్టిసీమ లిఫ్ట్ ద్వారా 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌కు తరలించి సద్వినియోగం చేసుకున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ంఖ అఓ అష్ణజీనిటతీజీఎజీఎబీ ఔజీతిటబీ) వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. పట్టిసీమ లిఫ్ట్ ద్వారా నీటిని తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాలకు రైతన్నలు సహకరించారని తెలిపారు. ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబును.. మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి కృష్ణా డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ఈరోజు (శనివారం) కలిశారు.

రైతన్నలకు సీఎం ప్రశంసలు..

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణాడెల్టాకు ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తీసుకువచ్చిన చంద్రబాబుకు రైతన్నలు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను శాలువాతో అన్నదాతలు, సాగునీటి సంఘాల ప్రతినిధులు సత్కరించారు. కృష్ణాడెల్టాకు గోదావరి నీటిని, శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా నీటిని రాయలసీమకు సీఎం చంద్రబాబు ఇచ్చి ఏపీకి జలప్రదాత అయ్యారని రైతన్నలు కొనియాడారు. అన్ని ప్రాంతాలకూ నీటి భరోసా కల్పించిన చంద్రబాబు ఏపీ వాటర్‌మ్యాన్ అంటూ రైతన్నలు ప్రశంసలు కురిపించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా వచ్చిన నీటితో కృష్ణాడెల్టాలో సిరులు పండించారని రైతులను సీఎం చంద్రబాబు కొనియాడారు.

ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రానికి జల భద్రత తీనుకువస్తాం: సీఎం

కాలువలను విస్తరించి రాష్ట్రానికి మరింత ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టు ఆలోచన ఈ ప్రాంత రైతుల కష్టాన్ని తీర్చి సంపద సృష్టించిందని పేర్కొన్నారు. కృష్ణాబేసిన్‌లో గోదావరి జలాలను వినియోగిస్తూ పొదుపు చేసుకున్న కృష్ణాజలాలను రాయలసీమలో సాగు, తాగునీటికి మళ్లించామని తెలిపారు. రాయలసీమలో కియా లాంటి ప్రతిష్టాత్మక పరిశ్రమలకు కూడా నీరు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రానికి జల భద్రత తీసుకువస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనెల 13న సీఎం చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ కీలక భేటీ.. కృష్ణా జలాలపై చర్చ



విజయవాడ, అక్టోబరు 10 : తమిళనాడు సీఎం విజయ్ విజయవాడలో పర్యటించనున్నారు. ఈ నెల 13వ తేదీన విజయవాడకు ఆయన రానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో విజయ్ సమావేశం కానున్నారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా కృష్ణా జలాల వాటాపై మాట్లాడనున్నారు.తెలుగు గంగ ఒప్పందం ప్రకారం తమకు నీరు అందట్లేదని తమిళనాడు సర్కార్ చెబుతోంది. ఏపీ నుంచి రావాల్సిన నీటి వాటాపై చంద్రబాబుతో విజయ్ చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌ల అంశంపైనా మాట్లాడే ఛాన్స్ ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ విజయ్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

విజయవాడ సరస్ మేళాకు రాష్ట్రపతి ముర్ము..

600 స్టాల్ల ఏర్పాటు: పెమ్మసాని చంద్రశేఖర్

విజయవాడ, అక్టోబర్ 10: విజయవాడ ఉత్సవ్‌తో పాటు సరస్ మేళాను ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమం సరస్ మేళా అని అన్నారు. మహిళలు వ్యాఎారవేత్తలుగా ఎదగడానికి మంచి వేదికగా చెప్పుకొచ్చారు. ఈనెల 15న సరస్ మేళాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేళాలో మొత్తం 600 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, దేశీయ రుచులను కూడా సరస్ మేళా ద్వారా పరిచయం చేయనున్నట్లు చెప్పారు.సరస్ మేళా ద్వారా గ్రామీణ మహిళలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించనుందని కేంద్రమంత్రి తెలిపారు. మహిళా ఉత్పత్తులకు జాతీయస్థాయి మార్కెటింగ్ వేదిక ఈ మేళా అని అన్నారు. దేశవ్యాప్తంగా ఆహార పదార్థాలు, కళలకు ఒకే వేదికగా వెల్లడించారు. ఈనెల 20 వరకు విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. సరస్ మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి: మంత్రి సత్యకుమార్



విజయవాడ, అక్టోబరు 10 : వికసిత్ భారత్?2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలో బీజేపీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, తదితర పోటీలను మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని.. వారే రేపటి దేశ నిర్మాతలు, నాయకులు అని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వివరించారు.

భారత్‌ను అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలి..

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. అప్పటికీ భారతదేశాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. దేశాభివృద్ధిలో యువత ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. వైద్య కళాశాలలు, వైద్య విద్యలో సీట్లు, ఉన్నత విద్యాసంస్థల విస్తరణతో విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థల విస్తరణ దేశ మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు.

ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలి..

పీఎం శ్రీ పాఠశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. సెమికండక్టర్లు, లిథియం బ్యాటరీలు, అరుదైన ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. యువత కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలని అభిలాషించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములయ్యేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నాం: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి, అక్టోబర్ 10: బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది తెలుగుదేశం పార్టీ స్పష్టమైన విధానమని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయం కారణంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ పదవులను కోల్పోయారని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, వారి హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల అంశంపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, గతంలో తీసుకున్న నిర్ణయాలకు వారే సమాధానం చెప్పాలని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.మరోవైపు.. రాష్ట్రానికి రావాల్సిన సుమారు రూ.12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి, స్థానిక సంస్థల బలోపేతానికి ఈ నిధులు కీలకమని పేర్కొంటూ, నిధుల విషయంలో రాజకీయాలకు తావివ్వకూడదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్లు నిర్లక్ష్యానికి గురయ్యాయని.. వాటి కార్యకలాపాలు నిర్వీర్యమై కనీస సదుపాయాలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడం, వారి హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

వైసీపీ హైకోర్టుకు వెళ్లకుంటే న్యాయం జరిగేది: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, అక్టోబర్10: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో గొడ్డలి పార్టీ హైకోర్టుకు వెళ్లకపోయి ఉంటే.. బలహీనవర్గాలకు న్యాయం జరిగేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బీసీలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. గొడ్డలి పార్టీకి ఈ ఎన్నికలు జరగడం ఇష్టం లేదని విమర్శించారు. ఈ ఎన్నికలు జరిగితే ఉన్న వది మంది కూడా పార్టీ వీడి వెళ్లిపోతారని భయం మొదలైందన్నారు. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందని.. దీనికి కేబినెట్‌లో ఆమోదం తెలిపామని అన్నారు. శనివారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ అయింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల జరగనున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నది ఎన్డీయే ఉద్దేశమని స్పష్టం చేశారు.బీసీలకు మొదటి నుంచి అండగా ఉన్నది టీడీపీ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 1987లో మొదటిసారి బీసీలకు ఎన్టీఆర్ రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. 20 శాతం ఉన్న రిజర్వేషన్లను 34 శాతానికి సీఎం చంద్రబాబు పెంచారని వివరించారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీకి బలహీనవర్గాలు అంటే చిన్నచూపు అంటూ మండిపడ్డారు. 2019లో బీసీలపై జరిగిన దమనకాండ గతంలో ఎప్పుడూ చూడలేదని చెప్పారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని అన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

ఆదివారం 11-10-2026

విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అనలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అనలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి.

విద్యుత్ ఛార్జీలు పెంపు వెనక్కి తీసుకోవాలి

గోదావరిఖని (తెలుగు కలం) అక్టోబర్-10తెలంగాణలో విద్యుత్ చార్జీల పెంపు (ట్రూ-అప్ చార్జీలు) ఆలోచనను విరమించుకోవాలి - ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్.తెలంగాణలో ట్రూ-అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై ఈ నిర్ణయం అదనపు భారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి టి. జి. ఈ. ఆర్. సి రాష్ట్రంలోని డిస్కమ్‌లకు రూ. 5,420 కోట్ల ట్రూ-అప్ చార్జీలను వినియోగదారుల నుండి వసూలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చిందని, దీని ప్రకారం నవంబర్ 2026 నుండి విద్యుత్ వినియోగంపై ప్రతి యూనిట్‌కు 30 పైసలు అదనంగా వసూలు చేస్తారని పేర్కొన్నారు. డిసెంబర్ 2026 నుండి ఈ అదనపు వసూలు యూనిట్‌కు 50 పైసలకు పెరుగుతుందని, దీని కాలపరిమితి దక్షిణ తెలంగాణ టి. జి .ఎస్ .పి .డి .సి. ఎల్ వినియోగదారులకు 29 నెలల పాటు, ఉత్తర తెలంగాణ పరిధిలో 26 నెలల పాటు సాధారణ ప్రజలపై ఈ అదనపు భారం కొనసాగుతుందని అన్నారు.ప్రభుత్వమే భరించాలని ప్రజల డిమాండ్‌గత ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన అదనపు విద్యుత్ కొనుగోళ్ల నష్టాలను (ట్రూ-అప్ చార్జీలు) ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో భరించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారని అన్నారు.



ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



గోదావరిఖని (తెలుగు కలం) అక్టోబర్-10మహిళలతో కలిసి బతుకమ్మ పేర్చి, ఆటపాటల్లో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి.లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్‌లో వల్స సుజాత నివాసంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి కాలనీ మహిళలతో కలిసి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, అనంతరం వారితో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలతో పండుగ సంబరాలను పంచుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ఈ వేడుకలు నిదర్శనమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ వండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడం అభినందనీయమన్నారుఈ కార్యక్రమంలో విజయ, తిరుమల, కనకలక్ష్మి, లచ్చమ్మ, కళావతి, మహేశ్వరి, శ్యామల, పద్మ, సాయిప్రియ, సరిత, కవిత, పావని శ్వేత భాగ్య సంజన, రమ్య, శారద, శాన్వి, యశస్వినీ, శాన్విక తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట మైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల సామగ్రి, సిబ్బంది, శిక్షణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు,(తెలుగు కలం) అక్టోబర్ 10:- త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు ముందస్తుగా సమగ్ర ఏర్పాట్లు చేపట్టి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... త్వరలో రానున్న పురపాలక, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర కనీస మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గుర్తించి, వాటిలో ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన రవాణా మార్గాలు, పోలింగ్ పార్టీల రాకపోకలకు సంబంధించిన ప్రణాళికను కూడా ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీతో పాటు ఇతర ఎన్నికల సామగ్రిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రిజర్వ్ బ్యాలెట్ బాక్సుల కేటాయింపు, భద్రత, పంపిణీ, పోలింగ్ అనంతరం తిరిగి స్వీకరణకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ టీమ్ తదితర టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన మానవ వనరులను ముందుగానే అంచనా వేసి, నిబంధనల ప్రకారం సమర్థులైన సిబ్బందిని గుర్తించి విధులు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. ఎన్నికల నిబంధనలు, విధులు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియపై ప్రతి ఉద్యోగికి పూర్తి అవగాహన కల్పించాలని, తద్వారా ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ రోజుకారోజు నివేదికలు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 19 అంశాలపై నోడల్ అధికారుల నియామకంఎన్నికల నిర్వహణకు సంబంధించి 19 కీలక అంశాల నిర్వహణ కు నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి నోడల్ అధికారి తనకు కేటాయించిన అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, కాలపట్టిక రూపొందించుకొని, సంబంధిత పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సుల సమీకరణ, కేటాయింపు, పంపిణీ, పోలింగ్ అనంతరం స్వీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఎన్నికల సిబ్బంది నియామకం, ఎన్నికల సామగ్రి నిర్వహణ, శిక్షణ కార్యక్రమాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, నామినేషన్ ల స్వీకరణ, ఎంసీసీ అమలు, రవాణా, రోజువారీ నివేదికల సమర్పణ, మీడియా మేనేజ్‌మెంట్ తదితర 19 విధుల నిర్వహణపై ఆయా అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అందుకు సంబంధించిన ఎన్నికల కమిషన్ నిబంధనలను క్షుణ్ణంగా చదువుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సున్నిత, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన అదనపు భద్రతా చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు.. ఎన్నికల నియమావళి అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, ఓట్ల లెక్కింపు, ఎన్నికల అనంతర ప్రక్రియలు పూర్తయ్యే వరకు నోడల్ అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 484 గ్రామ పంచాయతీ సర్పంచులు, 5100 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని, అలాగే, 26 జడ్పీటీసీలు,432 ఎంపీటీసీ లకు ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు సంబంధించి కూడా ముందస్తుగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జడ్పీ సీఈవో,.డిపివో లను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ఒక్కోసారి సింగిల్ డిజిట్ ఓట్ల కోసం సమస్యలు ఏర్పడతాయని, అందువల్ల అధికారులు చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. నామినేషన్లకు సంబంధించి ముందుగానే అభ్యర్థులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లకు సూచించారు.కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డిపివో భాస్కర్ ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్ల గురించి వివరించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్..

672 మద్యం బాటిళ్లు స్వాధీనం!ముగ్గురు అరెస్ట్..
స్థానిక ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు

కర్నూలు, (తెలుగు కలం) అక్టోబర్ 10:- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడే లక్ష్యంతో కర్నూలు జిల్లా పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు డీఎస్పీ కె. రాఘవేంద్ర పర్యవేక్షణలో కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా ఉలిందకొండ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, కె. నాగలాపురం ఎస్ఐ అఖిల్, సర్కిల్ పోలీసు సిబ్బంది, శిక్షణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులకు సంబంధించిన ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు.మూడు ప్రాంతాల్లో మద్యం బాటిళ్ల స్వాధీనంపోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఏరుకలి శేఖర్ వద్ద 144 మద్యం బాటిళ్లు, ఏరుకలి తిమ్మయ్య వద్ద 384 మద్యం బాటిళ్లు, ఏరుకలి సురేష్ వద్ద 144 మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి వద్ద కలిపి మొత్తం 672 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిపై కేసులు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఎన్నికల వేళ అక్రమ కార్యకలాపాలపై నిఘారాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రజలకు భద్రత కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు, ముందస్తు చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.



నవంబర్ 2వ వారం నుంచి కాళేశ్వరం పనులు

కరీంనగర్, అక్టోబరు 10,కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్టం చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియోగ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నదిపై నిర్మించిన ఒక బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల ప్రాజెక్టు. 2016లో శంకుస్థాపన చేయగా, తొలి దశ 2019 జూన్ 21న అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు 13 జిల్లాల గుండా సుమారు 500 కి.మీ (310 మైళ్ళు) దూరం విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు మొత్తం 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అందించడమే లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భ జలాల నుంచి 25). ఇందులో 169 టీఎంసీలను రైతులకు సాగునీటి కోసం, 30 టీఎంసీలను హైదరాబాద్ నీటి అవసరాలకు, 16 టీఎంసీలను ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 టీఎంసీలను సమీప గ్రామాలకు తాగునీటి కోసం కేటాయించారు.నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 ప్రధాన బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడంతో ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పగుళ్లకు రిపేర్లు చేపించాలని బీఆర్ఎస్ చెబుతుంటే.. భారీ స్కామ్ చేసి దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ మీద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది. ప్రాజెక్టు సేఫ్టీ మీద అనుమానంతోనే గత మూడేళ్లుగా బ్యారేజీల నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడం లేదు. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతున్నాయని తెలిసింద

14న సింహగర్జన

అదిలాబాద్, అక్టోబరు 10 సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. సింగరేణి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫలమైందంటూ అక్టోబర్ 14న రామగుండం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతోంది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్ రావు తదితరులు హాజరవుతున్నారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కే వాటా గణనీయంగా తగ్గిపోయిందనేది బీఆర్ఎస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు ఏకంగా 32 శాతం లాభాల వాటా అందిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆ వాటా 16 శాతానికి, ఆ తర్వాత 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని హరీష్ రావు ఆరోపించారు. దసరాకు ముందే లాభాలు, వాటాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ సంప్రదాయానికి తూట్లు పడ్డాయని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.సింగరేణి ఆర్థిక పరిస్థితిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 4,712 కోట్ల లాభాలను ఆర్జించగా, 2024-25 నాటికి అవి రూ. 6,394 కోట్లకు చేరాయని బీఆర్ఎస్ చెప్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం లాభాలు రూ. 1,800 కోట్లకు మించే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలు, టెండర్లలో జాప్యం, భారీ వ్యయంతో కూడిన కాంట్రాక్టుల కారణంగానే నంస్థ ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. మరోవైపు.. బ్యాంకుల్లో రూ.6,323 కోట్లు నిల్వ ఉన్నప్పటికీ, అదనంగా 4,000 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి బొగ్గు గనుల ప్రాంతాలు ఏ పార్టీ రాజకీయ భవిష్యత్తునైనా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు సింగరేణి కార్మికులను కూడగట్టడం ద్వారా ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోల్చి చెప్పడం ద్వారా కార్మిక లోకంలో సానుభూతిని పొందడమే లక్ష్యంగా ఈ 'కార్మిక గర్జన' రూపుదిద్దుకుంటోంది.మొత్తానికి? రామగుండం వేదికగా జరగనున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాత్మక అడుగుగా పరిశీలకులు భావిస్తున్నారు. కార్మిక సమస్యల పేరుతో తెరపైకి వస్తున్న ఈ రాజకీయం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మేడ్చల్ , కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం రాంపల్లి చౌరస్తా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాగారం నుండి అహ్మద్ గూడ వైపు వెళ్తున్న గ్యాస్ లారీ ప్రమాదపు శాత్తు వెనక టైర్ కిందపడి యువకుడు అక్కడికక్కడే మృతి. ఉదయం జిమ్ ముగించుకొని శివానంద్ పూరి కాలనీ లో తన ఇంటికి వెళ్తుండగా అఖిల్ (20 సంవత్సరాలు)లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు రోదన అక్కడ ఉన్న వారి ని కంటతడి పెట్టింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూగర్భ విద్యుత్..

6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్

హైదరాబాద్, అక్టోబరు 10,హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ఎఈఖఆఅఒ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ఎఈఖఆఅఒ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతం స్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా కొనసాగించేందుకు వీలవుతుందని ఎఈఖఆఅఒ అధికారులు వెల్లడించారు.అదే సమయంలో రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగ్గడంతో ప్రజల భద్రత కూడా మెరుగుపడనుంది. బాల్కనీలు, ఇళ్లు, ఫుట్‌పాత్‌లకు సమీపంలో ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్ల సమస్య తగ్గడంతో పాటు స్తంభాల సంఖ్య తగ్గడం వల్ల పాదచారులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో తీగల గందరగోళం తగ్గడం నగర సౌందర్యాన్ని పెంచే అంశంగా మారనుంది.ఈ ప్రాజెక్ట్‌లో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ూఅంఆం ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ నెట్‌వర్క్‌లో లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. భూగర్భ కేబుళ్లకు అనధికారికంగా కొక్కేలు వేయడం కష్టంగా ఉండటంతో విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. మొత్తంగా భూగర్భ కేబులింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, అందమైన, ఆధునిక విద్యుత్ వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశలో కీలక అడుగుగా నిలవనుంది. భవిష్యత్తులో నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించే అవకాశం ఉంటుంది.

పనితీరుపై రేవంత్ నజర్

హైదరాబాద్, అక్టోబరు 10,తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు? వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకేవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణంలోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

సీజేపీ ప్లాన్ 'బి'.. జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు అజింక్య షిండే నేతృత్వం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనలకు కీలక సభ్యుడు అజింక్య షిండే నేతృత్వం వహించనున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అతడి బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో ప్లాన్ 'బి' అమలుకు రంగం సిద్ధమైంది. ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో బయలుదేరిన అభిజీత్ దిప్కే, సీజేపీ సభ్యులైన సౌరవ్ దాస్, అశుతోష్ ర్యాంకాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాగానే విమానంలో ఉండగానే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అజ్ఞాత ప్రదేశానికి వారిని తరలించారు.కాగా, ఢిల్లీ పోలీసుల ఎత్తుగడలను ముందుగానే ఊహించిన సీజేపీ ప్లాన్ 'బి'ని సిద్ధం చేసింది. శనివారం విడుదల చేసిన ఒక ముందస్తు రికార్డెడ్ వీడియోలో అభిజీత్ దీప్కే ఈ విషయాన్ని ప్రకటించారు. అగ్రనాయకత్వం అందుబాటులో లేని



సమయంలో నిరసనల బాధ్యతలను అజింక్య షిండేకు అప్పగిస్తున్నట్లు అందులో తెలిపారు. 'మీరు ఈ వీడియోను చూస్తున్నారంటే, నాతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ ర్యాంకా అరెస్టయ్యామని అర్థం. మా గైర్హాజరీలో నిరసన కార్యక్రమాలకు, సీజేపీ ఉద్యమానికి అజింక్య నాయకత్వం వహిస్తారు. దయచేసి ఆయనను అనుసరించండి' అని ఆ వీడియోలో దిప్కే పేర్కొన్నారు. అభిజీత్ దీప్కే బృందాన్ని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకోగానే సీజేపీ ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

ఢిల్లీ హైకోర్టులో విజయ్ దేవరకొండకు ఊరట..

వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తూ కోర్టు తీర్పు



హైదరాబాద్, అక్టోబరు 10, నటుడు విజయ్ దేవరకొండకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, గొంతు మరియు ఇతర వ్యక్తిగత హక్కులను అనధికారికంగా ఇతరులు వాడకుండా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ంఎ), డీప్‌ఫేక్స్ మరియు ఫేస్-మార్ఫింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఆయనను అశ్లీల లేదా అనభ్యకర రీతిలో చిత్రీకరిస్తున్న కంటెంట్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది.న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ.. మెటా గూగుల్ ఎక్స్ (చీ) వంటి సోషల్ మీడియా సంస్థలు నటుడు గుర్తించిన అక్రమ కంటెంట్, వీడియోలు, రీల్స్, పోస్టులు మరియు అకౌంట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు సంబంధిత లింక్‌లను 72 గంటల్లోగా టేకడౌన్ చేయాలని స్పష్టం చేశారు.విజయ్ దేవరకొండ తన పేరు (విజయ్ దేవరకొండ, విజయ్ సాయి దేవరకొండ), 'ఎఆ' అనే ఇనిషియల్స్, సిగ్నేచర్లు, వాయిస్ రికార్డింగ్‌లు, ఫ్యాషన్ స్టైల్, సినిమా స్టిల్స్ వంటి వాటిని వాణిజ్యపరంగా ఎవరూ దుర్వినియోగం చేయకుండా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయనకు ఎంతో ఇష్టమైన "రౌడీ" (ఖీనీలిటఎ) అనే పేరును కేవలం ఒంటరిగా వాడడంపై మాత్రం కోర్టు ఎక్స్-పార్టీ ఇంజంక్షన్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ పేరు ఆయనకు మాత్రమే ప్రత్యేకంగా చెందుతుందని నిరూపించే తగిన సాక్ష్యాధారాలు అవసరమని కోర్టు పేర్కొంది. అదే సమయంలో, "రౌడీ" అనే పదాన్ని విజయ్ ఏఐ లేదా మార్ఫ్ ఇమేజ్‌లతో కలిపి వాడితే మాత్రం అది ఆయన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను డిసెంబర్ 3కి మరియు తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేస్తూ, ప్రతివాదులు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది

సీజేపీ నిరసనల బాధ్యతలు అజింక్య షిండేకు.. ఆయన ఎవరంటే?



న్యూఢిల్లీ: సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఆయన బృందాన్ని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్లాన్ 'బి'ని సీజేపీ అమలు చేయనున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన నిరసనల బాధ్యతను కీలక సభ్యుడైన అజింక్య షిండేకు అప్పగించింది. దీంతో అభిజీత్ దిప్కే గైర్హాజరీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ఆందోళనకు నాయకత్వం వహించనున్న ఆయన ఎవరు అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.కాగా, మహారాష్ట్రలోని తీరప్రాంత పట్టణమైన అలీబాగ్‌కు చెందిన అజింక్య షిండే చాలా ఏళ్లుగా అభిజీత్ దీప్కేకు సన్నిహితుడు. 2016లో గోవాలో దీప్కేను మొదటిసారి ఆయన కలిసినట్లు సమాచారం. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జాతీయ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా అజింక్య షిండే ఉన్నారు. సీజేపీ ముంబై విభాగంలో కీలక వ్యక్తి. ఈ నెల ప్రారంభంలో ముంబైలో జరిగిన 'ప్రెజర్ గ్రూప్' ఆందోళన కార్యక్రమానికి ఆయన నిర్వాహకుడిగా వ్యవహరించారు.మరోవైపు అజింక్య షిండే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మహారాష్ట్ర బృందానికి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ఆ పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేయడానికి తన కార్పొరేట్ ఉద్యోగాన్ని ఆయన వదిలేశారు. ఆప్‌లో చేరిన తర్వాత గోవా ఎన్నికల కోసం ఒక సంవత్సరం పూర్తిగా తన సమయాన్ని ఆయన కేటాయించారు. గోవా అసెంబ్లీ ఎన్నికలలో ఖాతా తెరువడంలో ఆప్ విఫలమైనప్పటికీ ఆ పార్టీ పట్ల అజింక్య నిబద్ధతతో ఉన్నారు. ఆప్ మహారాష్ట్ర బృందంతో కలిసి ఆయన పనిచేశారు. మహారాష్ట్రలోని ప్రతి జిల్లాలో అజింక్య షిండే పర్యటించినట్లు తెలుస్తున్నది.

సూపర్‌మార్కెట్‌లో పైకప్పు కూలి 38 మందికి గాయాలు

సియోల్ : దక్షిణకొరియాలోని ఓ షాపింగ్ మాల్‌లో పైకప్పు కూలడంతో సుమారు 38 మంది గాయపడ్డారు. ఈ ఘటన డేగూ సిటీలో జరిగింది. ప్లాస్టర్ సీలింగ్ కూలినట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో చిక్కుకున్న 66 మందిని సురక్షితంగా తరలించినట్లు డేగూ అగ్నిమాపక శాఖ పేర్కొన్నది. ఇవాళ ఉదయం 10.16 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. వివిధ ఆస్పత్రుల్లో కొందరు చికిత్స పొందుతున్నారు. గాయపడ్డవారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని, కానీ తీవ్రంగా గాయపడ్డ వారు ఎవరూ లేరని అధికారులు చెప్పారు. నాలుగు అంతస్తుల బిల్డింగ్‌లో రెండో అంతస్తు పైకప్పు ప్లాస్టరింగ్ కూలిందని ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ యూన్ జూంగ్ మి తెలిపారు. అయితే దేని వల్ల పైకప్పు కూలిందో తేల్చలేదు. ఈ ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మయుంగ్ తెలిపారు.



బ్యాలెట్ తో ఎన్నికలు

విజయవాడ, అక్టోబరు 11,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కనరత్తు చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.

బెజవాడకు దళపతి విజయ్



విజయవాడ, అక్టోబరు 11,తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చని భావిస్తున్నారు.తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు తెరలేపడం ఖాయం.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

నూతన డీఎస్పీ పావనికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అభినందనలు

శ్రీకాళహస్తి,శ్రీకాళహస్తి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కార్యాలయానికి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. పావని మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆమెను సాదరంగా కలిసి అభినందనలు తెలియజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి భద్రతకు భరోసా కల్పించాలని ఆకాంక్షించారు.అనంతరం శ్రీకాళహస్తి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, లా అండ్ ఆర్డర్ నిర్వహణ, నేరాల నియంత్రణతో పాటు పలు స్థానిక సమస్యలపై రక్షణ కల్పించేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల భద్రతే పోలీసు శాఖకు ప్రథమ ప్రాధాన్యత కావాలని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

అల్తాఫ్ బాబా కు విజయవాడ ఉత్సవ్ సీజన్- 2 ఆహ్వానం

కొండపల్లి ,విజయవాడ లో దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ సీజన్- 2 ఆహ్వానాన్ని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయం నుంచి చంద్రశేఖర్ శుక్రవారం సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా కు అందజేశారు. ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.ఈ సందర్భంగా అల్తాఫ్ బాబా మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్ర పండగలు నిర్వహించిన ఉత్సవాలు, ఈ సంవత్సరం రాష్ట్రపతి హాజరు కావడం, దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమంత్రిలను ఆహ్వానించి దేశ పండగగా చేయటం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గెలుపొందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి దిశా నిర్దేశం చేస్తూ దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి అన్నారు. ఉప ముఖ్యమంత్రి ముఖ్యమంత్రికి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు అన్నారు. పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ ప్రతిష్ట పెరిగేలా ఉత్సవాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఉత్సవాలు విజయవాడలో జరగటం, ఇక్కడ స్థానికంగా ఉన్నవారు గర్వపడేలా విజయవంతంగా ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.విజయవాడ దసరా ఉత్సవాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లినందుకు ప్రభుత్వ నాయకులకు ముస్లిం వర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా అభినందనలు.విజయవాడలో జరిగే దసరా ఉత్సవాలను ఒక కులానికో, మతానికో పరిమితం కాకుండా, అందరూ కలిసికట్టుగా జరుపుకునే గొప్ప వేడుకగా, అలాగే జాతీయ స్థాయి వేడుకగా తీర్చిదిద్దడం పట్ల ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బోర్డ్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా బోర్డు ప్రతినిధులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) నేతృత్వంలో విజయవాడ దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులతో విజయవాడ ఉత్సవాన్ని గతంలో కంటే మిన్నగా దేశవ్యాప్త గుర్తింపు తెచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని తెలిపారు.కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పాల్గొనే ఇటువంటి కార్యక్రమాలు మన దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, సాంప్రదాయాలను కాపాడుతాయని పేర్కొన్నారు.హిందూ ఉత్సవాలతో పాటు, క్రిస్టియన్ మేరీ మాత ఉత్సవాలు మరియు 450 సంవత్సరాల చారిత్రక నేపథ్యం ఉన్న షాబుఖారి దర్గా ఉత్సవాలను కూడా ప్రభుత్వమ్ ప్రభుత్వ ఉత్సవం లా చేసి అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక అభినందనలు తెలిపారు.భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ అందరి సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు కూటమి ప్రభుత్వానికి ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా (షాబుఖారి ఆస్తానా) తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, బీసీ బిడ్డ.. నందికొట్కూరు చైర్మన్ రేసులో జనసేన నేత మాసమ్ సాహెబ్

ప్రజారాజ్యం నుండి జనసేన వరకు.. పార్టీ కోసం ప్రాణం పెట్టిన సమాజసేవకర్తకు చైర్మన్ పదవే లక్ష్యం

వేతనంలో సగం పేదలకే.. నందికొట్కూరును అభివృద్ధి బాటలో నడిపిస్తా

మాసమ్ సాహెబ్ సంచలన హామీ

నందికొట్కూరు , ప్రజారాజ్యం నుంచి జనసేన వరకు పార్టీ జెండా మోసిన నిఖార్సయిన జన సైనికుడు బీసీ బిడ్డ మాసమ్ సాహెబ్ నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ పీఠంపై కన్నేశారు. జనసేన పార్టీ అవకాశం ఇస్తే చైర్మన్ రేసుకు సిద్ధమని సంచలన ప్రకటన చేశారు.తాను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, సమాజ సేవకుడిగా నందికొట్కూరు పట్టణంలోనే పుట్టి పెరిగానని, ఈ పట్టణంలోని ప్రతి వీధి, ప్రతి సమస్య తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు.క్యాడర్ ఆవేదనను వినిపించిన మాసమ్ సాహెబ్. 2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో జనసేన నాయకులు కార్యకర్తలు వీరమహిళలు ప్రాణం పెట్టి పనిచేశారు.కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు చెప్పుకోదగ్గ నామినేటెడ్ పదవులు గానీ టెండర్లు గానీ ఎక్కడా దక్కలేదు.ఇది చాలా బాధాకరం. దీంతో నియోజకవర్గ స్థాయిలో క్యాడర్ తీవ్ర అలకతో ఉంది. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్తలకు అధికారికంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలి అని మాసమ్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు.నాకు జనసేన పార్టీ చైర్మన్ గా అవకాశం ఇస్తే.. నందికొట్కూరు మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఎవరూ చూడని అభివృద్ధిని చేసి చూపిస్తా. కూటమిలోని తెలుగుదేశం బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా.నేను చైర్మన్ గా తీసుకునే గౌరవ వేతనంలో సగభాగాన్ని పదవిలో ఉన్నంతకాలం పేద ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తానని మాట ఇస్తున్నా అని ఆయన ప్రకటించారు

మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

రూ.5 వేల జరిమానా.. చెల్లించకపోతే మరో మూడు నెలలు అదనపు శిక్ష

కోర్టు మానిటరింగ్‌తో కేసుల విచారణలో ప్రగతి

రాజమౌమ్మంగి, మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి కాకినాడ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతోపాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని, చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించింది. బాధితురాలికి నష్టపరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది.రాజమౌమ్మంగి సర్కిల్ పరిధిలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన ఈ కేసులో కాకినాడ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె. శ్రీదేవి తీర్పు వెలువరించారు. 2020లో నమోదైన కేసుపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 అక్టోబరు 18న చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై జడ్డంగి చైతన్యనగర్‌కు చెందిన తెడ్ల శ్రీను అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి జడ్డంగి ఎస్సై ఎం. మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రాఫిక్ డీఎస్పీ బి. రామకృష్ణ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.కేసు దర్యాప్తును పూర్తిచేసిన పోలీసులు ఐదు రోజుల్లోనే న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోక్సో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంకె శ్రీదేవి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. కోర్టు మానిటరింగ్‌తో విచారణపై పర్యవేక్షణమహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ప్రతి కోర్టుకు ప్రత్యేక కానిస్టేబుల్‌ను నియమించడంతోపాటు, జిల్లా స్థాయిలో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ సెల్ ఏర్పాటు చేసి కేసుల విచారణ పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంకె శ్రీదేవి, దర్యాప్తు అధికారి బి. రామకృష్ణ, రంపచోడవరం ఎస్‌డీపీఓ అశ్రఫ్ అలీ, రాజమౌమ్మంగి సీఐ ఎన్. సన్యాసినాయుడు, కోర్టు మానిటరింగ్ సీఐ ఎం. ముక్తేశ్వరరావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ కోటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నేరాల నియంత్రణకు చర్యలు కొనసాగిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

వీధి డ్రైనేజీ నుంచి కాలువలోకి మల వ్యర్థాలు

నెల రోజులుగా అధికారులకు విన్నవించినా స్పందన కరువు

తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

తిరుపతి, నగరంలోని న్యూ ఇందిరానగర్ ప్రాంతంలో వీధి డ్రైనేజీ నుంచి మల వ్యర్థాలు పైపుల ద్వారా కాలువలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యర్థాల కారణంగా పరిసర ప్రాంతాల్లో విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తోందని, ఇళ్లలో నివసించడం కూడా ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గత నెల రోజులుగా మున్సిపల్ అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని స్థానికులు చెబుతున్నారు. సమస్యను పరిశీలించిన పారిశుధ్య విభాగం అధికారులు ఇది తమ పరిధిలోకి రాదని, ఇంజనీరింగ్ విభాగం డీఈ రాజు దృష్టికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. దీంతో ఇంజనీరింగ్ విభాగం అధికారులకు కూడా పలుమార్లు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని పేర్కొంటున్నారు. మల వ్యర్థాలు కాలువలోకి చేరడం వల్ల తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోందని, ఈ సమస్యతో చిన్నారులు, వృద్ధులు సహా పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా తిరుపతి మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని, క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, వీధి డ్రైనేజీ నుంచి కాలువలోకి మల వ్యర్థాలు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని న్యూ ఇందిరానగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగం

తిరుపతి అక్టోబరు 11ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాల్లో వ్యాపారాలు, నివాస గృహాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత నిబంధనలు తెస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్-2026 ను అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న సంక్లిష్టమైన విభిన్న జోనింగ్ నిబంధనలను రద్దు చేసి, ఆధునిక అవసరాలకు తగినట్లుగా కేవలం 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగాన్ని క్రమబద్ధీకరించారు.ఈ నూతన విధానంలో అత్యంత కీలకమైన అంశం నెగిటివ్ లిస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం. గతంలో ఒక నిర్దిష్ట భూమిలో ఏ నిర్మాణానికి అనుమతి ఉందో తెలుసుకోవడానికి పౌరులు, డెవలపర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు నెగిటివ్ లిస్ట్ ద్వారా సదరు జోన్‌లో ఖచ్చితంగా ప్రోహిబిటెడ్ కార్యకలాపాలు మినహా, మిగిలిన అనుకూల ప్రాజెక్టులన్నింటికీ ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే వీలుంది. ఈ పారదర్శక విధానం వల్ల అధికారులు నిబంధనల పేరుతో చేసే అనవసర ఆటంకాలకు, అవినీతికి శాశ్వత చెక్ పడనుంది.ఈ కొత్త జోనింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇటీవలే సమగ్రంగా సవరించిన 'ఏపీ బిల్డింగ్ రూల్స్'ను కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 24 మీటర్లు , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను 'హైరైజ్' భవనాలుగా పరిగణిస్తూ, వాటికి అవసరమైన ఫైర్, పర్యావరణ అనుమతులను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. అంతేకాకుండా, పెద్ద నివాస, వాణిజ్య కాంప్లెక్స్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ఆఫీసుల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని నిబంధనల్లో భాగం చేశారు.ఈ జోనింగ్ సంస్కరణల వల్ల గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి అందడమే కాకుండా, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగవుతుంది. సుదీర్ఘకాలంగా మాస్టర్ ప్లాన్లు, భూ వినియోగ మార్పిడుల వివాదాల్లో చిక్కుకున్న భూములకు స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి వ్యాపారం, మౌలిక వసతుల కల్పన వేగవంతం కానున్నాయి

దసరా నవరాత్రుల వేళా ...

అమ్మ వారి విగ్రహ ఏర్పాటు విషయంలో ఇరు వర్గాల మధ్యగొడవ.... మహిళలు తో సహా తుక్కు తుక్కు గా కొట్టుకున్న వైనం

పల్నాడు ,రాజుపాలం మండలం దేవరంపాడు లో ఇరు వర్గాల వైరం ఘర్షణకు దారి తీసింది. రామారావు వెర్సెస్ శ్రీను వర్గం పరస్పర దాడులకు దిగాయి. దేవరంపాడు గ్రామాలోని రామాలయంలో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దసరా సందర్భంగా ఆలయంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ఒక వర్గం, అందుకు అంగీకరించేది లేదని మరో వర్గం పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. విగ్రహాన్ని ఆలయం వద్దకు తీసుకురావడంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో 10 మందికి స్వల్ప గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

సత్తెనపల్లిలో పోలీసుల ముమ్మర తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో నిర్మల నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్..

40 ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్

పల్నాడు,సత్తెనపల్లి: రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా సత్తెనపల్లి పట్టణంలోని నిర్మల నగర్‌లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఐజీ, జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు బలగాల సమన్వయంతో ఈ ముందస్తు తనిఖీలు చేపట్టారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. గత 2019, 2021, 2024 ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడినట్లు గుర్తించిన వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. అవసరమైన నిబంధనల ప్రకారం వారిపై బైండోవర్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని, నేర స్వభావం, పరిస్థితుల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా మారితే భవిష్యత్తులోనూ చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయ నాయకులు అండగా ఉంటారనే భావనతో చట్టాన్ని ఉల్లంఘించవద్దని సూచించారు.సత్తెనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేకంగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలో పోలీసు బందోబస్తును మరింత పటిష్ఠం చేస్తామని అధికారులు తెలిపారు. చిన్నపాటి ఘర్షణలు జరిగినా ఉపేక్షించకుండా, పరిస్థితులకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో సరైన వాహన పత్రాలు లేని సుమారు 40 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

ప్రేమ వేధింపులతో యువతి ఆత్మహత్య

పరిగివికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లి గ్రామంలో దారుణం జరిగగింది. ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలు గ్రామశివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చరణ్ అనే యువకుడు ప్రేమించాలని పదే పదే ఫోన్ చేసి ఒత్తిడి చేసాడు. పోలీసులు బాలిక మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చరణ్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తుంబిగనూరులో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్, గ్రామావగాహన సభ



కనేకల్ తెలుగుకలం ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ప్రజలు ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కణేకల్ సబ్ ఇన్స్పెక్టర్ వై. నాగమధు సూచించారు. కణేకల్లు మండల పరిధిలోని తుంబిగనూర్ గ్రామంలో శనివారం పోలీసు సిబ్బందితో కలిసి ఆయన విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ఆశచూపులకు లేదా ప్రలోభాలకు లొంగకుండా నిష్పాక్షికంగా తమ ఓటు హక్కును వేయాలని స్పష్టం చేశారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా గ్రామస్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుంతకల్లులో శ్రీ మహేంద్ర కల్యాణ మండపం నిర్వహణపై వివాదం

రాజీ మార్గంలో సమస్య పరిష్కారానికి విరాళదాతల మొగ్గు



గుంతకల్లు తెలుగుకలం ప్రతినిధి : అనంతపురం జిల్లా గుంతకల్లు తిలక్ నగర్‌లోని శ్రీ మహేంద్ర కల్యాణ మండపం నిర్వహణ, నూతన కమిటీ ఏర్పాటు అలాగే బుకింగ్‌ల ఆదాయం విషయంలో తీవ్ర వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో విరాళదాతలు ప్రత్యేకంగా సమావేశమై తమ అభిప్రాయాలను స్పష్టం చేశారు. సంఘం బైలాస్ ప్రకారం విరాళదాతల పూర్తి ఆమోదంతోనే నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. అయితే గత కమిటీ పదవీకాలం ముగిసినప్పటికీ, బుకింగ్‌ల ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన లెక్కలను ఇప్పటివరకు సమర్పించలేదని విరాళదాతలు ఆరోపించారు. సుమారు 15 లక్షల రూపాయల వరకు నగదు ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసిన వారు, పూర్తి లెక్కలు వెల్లడించి ఆ మొత్తాన్ని వెంటనే బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక లావాదేవీలపై అధికారిక లెక్కల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. వ్యక్తిగత విభేదాల కారణంగా సంఘం ప్రతిష్ఠ ఏమాత్రం దెబ్బతినకూడదని, పరస్పర చర్చలతో ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని విరాళదాతలు అభిప్రాయపడ్డారు. చంద్రశేఖర్ గనుక చర్చలకు ముందుకు వస్తే తాము కూడా రాజీకి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరోవైపు, నూతన కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం బుకింగ్‌లు తిరిగి ప్రారంభమైనట్లు వారు ప్రకటించారు. వివాహాలు తదితర శుభకార్యాల బుకింగ్‌ల కోసం నవీన్, విశ్వనాథ్, మంజునాథ్‌లను సంప్రదించాలని, ఇప్పటికే ముందస్తు బుకింగ్‌లు చేసుకున్నవారు నేరుగా మండపం కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

రాయదుర్గం ప్రజలకు 30 ఏళ్ల తాగునీటి భరోసా.

గడువులోగా అమృత్-2 పనులు పూర్తి : ఎమ్మెల్యే కాలవ.



రాయదుర్గం తెలుగుకలం ప్రతినిధి : రాయదుర్గం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అమృత్-2 పథకం కింద రూ.78 కోట్లతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. రాయదుర్గం పట్టణంలో కొనసాగుతున్న తాగునీటి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారుల సమన్వయంతో జిందాల్ షా సంస్థ ఈ పనులను చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రాయదుర్గం పట్టణానికి రాబోయే 30 ఏళ్ల పాటు తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కనేకల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి రాయదుర్గం వరకు సుమారు 16.5 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో ఆరు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు కూడా చేపడతామన్నారు. పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించడంతో పాటు, 76 కిలోమీటర్ల మేర సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా 6,200 కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నామని చెప్పారు. పట్టణ పరిధితో పాటు శివారు ప్రాంతాలకు కూడా అమృత్-2 పథకాన్ని విస్తరిస్తామని తెలిపారు. రాబోయే మూడు దశాబ్దాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో రాయదుర్గం పట్టణ ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పట్టి 16 వేలకుపైగా మెజారిటీతో తనను గెలిపించారని గుర్తుచేశారు. ప్రజలు అందించిన బలంతో గత రెండేళ్లలో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి సహకరించాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టంకశాల హనుమంతు, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, బంగి శంకర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు,సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ, కొండాపురం శ్రీనివాసులు, ఆనంద్, మల్లికార్జున,పైతోట అంజి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు మున్సిపల్ పీఠంపై ఉత్కంఠ!

టికెట్ ఎవరికి..? రెబల్స్‌గా మారేదెవరు?

గుంతకల్లు, గుత్తి మున్సిపాలిటీలపై ప్రధాన పార్టీల గురి.. రిజర్వేషన్‌పై ఆశావహుల్లో టెన్షన్!



గుంతకల్లు తెలుగుకలం ప్రతినిధి : గుంతకల్లు మున్సిపల్ పీఠం ఎవరికి దక్కనుంది? చైర్మన్ రిజర్వేషన్ ఎవరికి అనుకూలంగా ఉండనుంది? పార్టీల తరపున టికెట్లు దక్కించుకునే నేతలెవరు? టికెట్ రాని ఆశావహులు రెబల్స్‌గా బరిలోకి దిగుతారా? ప్రస్తుతం గుంతకల్లు రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నలపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. గుంతకల్లు, గుత్తి మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయన్న చర్చ స్థానికంగా వినిపిస్తోంది.

రిజర్వేషన్ ప్రకటనపై ఎదురుచూపులు..

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియపై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో చైర్మన్ పదవికి రిజర్వేషన్ ఎలా ఖరారవుతుందన్న అంశం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. రిజర్వేషన్ ప్రకటన తర్వాతే చైర్మన్ పదవిని లక్ష్యంగా చేసుకున్న నాయకుల రాజకీయ లెక్కలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. మరోవైపు వార్డు స్థాయిలో టికెట్లు ఆశిస్తున్న నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గుంతకల్లు మున్సిపాలిటీలో గతంలో 37 వార్డులు ఉండగా, ప్రస్తుతం 48 వార్డులకు విస్తరించినట్లు సమాచారం. వార్డుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల సమన్వయం, ఓటర్ల మద్దతు కూడగట్టడం ప్రధాన పార్టీలకు కీలకంగా మారనున్నాయి.

టీడీపీలో టికెట్ల కేటాయింపు కీలకం..

2024 అసెంబ్లీ ఎన్నికల్లో గుంతకల్లు నుంచి టీడీపీ తరపున గుమ్మనూరు జయరాం విజయం సాధించగా, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున వై. వెంకట్రామిరెడ్డి గెలుపొందారు. దీంతో రాబోయే మున్సిపల్ ఎన్నికలు స్థానికంగా తమ రాజకీయ బలాన్ని నిరూపించుకునేందుకు ప్రధాన పార్టీలకు మరో కీలక వేదికగా మారనున్నాయి. టీడీపీలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నాయకత్వంలో అభ్యర్థుల ఎంపిక ఎలా సాగుతుంది? మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్‌కు సంబంధించిన స్థానిక నాయకులతో సమన్వయం ఎలా ఉంటుంది? టికెట్ల కేటాయింపులో ఎవరికి ప్రాధాన్యం లభిస్తుంది? అన్న అంశాలు ఆసక్తి రేపుతున్నాయి. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంటే నాయకత్వానికి అభ్యర్థుల ఎంపిక సవాలుగా మారే అవకాశముంది.

టికెట్ దక్కకుంటే రెబల్స్‌గా బరిలోకి దిగుతారా?

మున్సిపల్ ఎన్నికల్లో ఆసలు రాజకీయ పరీక్ష అభ్యర్థుల ఎంపిక సమయంలోనే ఎదురయ్యే అవకాశముంది. టికెట్ ఆశిస్తున్న నాయకులందరికీ అవకాశం కల్పించడం పార్టీలకు సాధ్యం కాకపోవచ్చు. దీంతో టికెట్ దక్కని అసంతృప్త నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారా? లేక ఇతర పార్టీల వైపు అడుగులు వేస్తారా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. రెబల్ అభ్యర్థులు బరిలోకి దిగితే అధికారిక అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా స్థానికంగా వ్యక్తిగత అనుచరగణం, సామాజిక సమీకరణాలు, వార్డు స్థాయి పరిచయాలు ఉన్న ఆశావహులు స్వతంత్రంగా పోటీ చేస్తే ప్రధాన పార్టీలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు.

గుమ్మనూరు జయరాం, వై. వెంకట్రామిరెడ్డి వ్యూహాలపై ఆసక్తి..

గుంతకల్లు మున్సిపాలిటీపై పట్టు సాధించేందుకు గుమ్మనూరు జయరాం ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తారు? టికెట్లు ఆశిస్తున్న నాయకుల మధ్య సమన్వయాన్ని ఎలా సాధిస్తారు? వైసీపీ తరపున వై. వెంకట్రామిరెడ్డి ఎలాంటి రాజకీయ వ్యూహాలతో ముందుకు వెళ్తారు? అభ్యర్థుల ఎంపికలో ఎవరికి ప్రాధాన్యం లభిస్తుంది? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. గుంతకల్లుతో పాటు గుత్తి మున్సిపాలిటీలోనూ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని లేదా సాధించాలని ప్రధాన పార్టీలు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే రిజర్వేషన్ల ప్రకటన, ఎన్నికల షెడ్యూల్, అధికారిక అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాతే రాజకీయ పరిస్థితులపై మరింత స్పష్టత రానుంది.

మున్సిపల్ పీఠం దక్కించుకునేదెవరు?

గుంతకల్లు మున్సిపల్ పీఠంపై ఆశలు పెట్టుకున్న నేతల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. రిజర్వేషన్ ఎవరికి అనుకూలంగా మారుతుంది? టికెట్ ఎవరికి దక్కుతుంది? అసంతృప్త నేతలు రెబల్స్‌గా మారుతారా? గుంతకల్లు, గుత్తి మున్సిపాలిటీల్లో రాజకీయ ఆధిపత్యం సాధించేదెవరు? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే రిజర్వేషన్ల ప్రకటన, ఎన్నికల నోటిఫికేషన్, అభ్యర్థుల ఎంపిక వరకు వేచి చూడాల్సిందే.

రాయదుర్గంలో దళిత హక్కుల పోరాట సమితి (DHPS) నూతన నియోజకవర్గ సమితి ఎన్నిక



రాయదుర్గం తెలుగుకలం ప్రతినిధి : అనంతపురం జిల్లా రాయదుర్గంలోని CPI పార్టీ కార్యాలయంలో దుర్గన్న అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి (DHPS) నూతన నియోజకవర్గ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి DHPS అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మరియు CPI నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, రాష్ట్రంలో దళితుల సమస్యల పట్ల ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ దళితులపై దాడులు పెరుగుతున్నప్పటికీ SC/ST అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం లేదని విమర్శించారు. దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను అగ్రవర్ణ భూస్వాములు, అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో దళితులకు పనులు సరిగా కల్పించడం లేదని, పనులు చేసిన వారికీ బిల్లులు పెండింగ్‌లోనే ఉంచారని పేర్కొన్నారు. దళిత వాడల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. విద్య మరియు ఉద్యోగ రంగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోవడంతో పాటు, విదేశీ విద్య పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఇళ్ల పట్టాలు మరియు ఇళ్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని ధ్వజమెత్తారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, వారి సంక్షేమం మరియు హక్కుల సాధన కోసం DHPS ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ప్రతి మండలం మరియు గ్రామంలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా కొత్తపల్లి తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆయత్ పల్లి గోపీనాథ్, కోశాధికారిగా దుర్గన్న ఎంపికయ్యారు. అలాగే నియోజకవర్గ ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా మారెన్న, నవీన్, డి.మారెన్న, గురప్ప, చౌడప్ప, శంకర్, సురేష్, గజేంద్ర, మహేష్‌లతో పాటు మొత్తం 11 మంది సభ్యుల కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో అనేకమంది CPI నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు మరియు నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన పార్లమెంట్ నిర్వాహక్ దళ్ సభ్యునిగా నంబూరి రవితేజ

స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ బాధ్యతల అప్పగింత



గుంతకల్లు తెలుగుకలం అక్టోబర్ 10 : జనసేన పార్టీలో నంబూరి రవితేజకు కీలక బాధ్యతలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ నిర్వాహక్ దళ్‌లో సభ్యునిగా ఆయన నియమితులయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయానికి సంబంధించి అనంతపురం పార్లమెంట్ పరిధిలోని బాధ్యతలను పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయనకు అప్పగించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు, ఇతర పార్టీ నాయకత్వానికి నంబూరి రవితేజ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనకు కల్పించిన ఈ అవకాశాన్ని ఎంతో గౌరవంగా స్వీకరిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహిస్తానని రవితేజ హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయంలో జనసేన పార్టీ నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

స్పోర్ట్స్ న్యూస్

టీమిండియాతో సిరీస్.. న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ



భారత్, న్యూజిలాండ్ మధ్య త్వరలో మల్టీ ఫార్మాట్ సిరీస్ జరగనుంది. ఈ నేపథ్యంలో కివీస్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ విల్ ఓ రూర్క్ కు గాయమైంది. ఈ కారణంతో అతడు భారత్‌తో జరగనున్న టీ20లతో పాటు వన్డే, టెస్టు సిరీస్‌లకు దూరమయ్యాడు. రూర్క్ ప్రస్తుతం కాలి కండరాల గాయంతో బాధపడుతున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. భారత్ జట్టు న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా అక్టోబర్ 22 నుంచి ఐదు టీ20ల సిరీస్‌తో పాటు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌కు ముందు కివీస్‌ను గాయాల బెడద వెంటాడుతోంది. రూర్క్‌తో పాటు మార్క్ చాప్‌మన్, జాక్ ఫౌల్క్స్ కూడా టీ20లకు దూరమయ్యారు.తాజాగా రూర్క్ గాయాన్ని న్యూజిలాండ్ హెడ్‌కోచ్ రాబ్ వాల్టర్ ధ్రువీకరించాడు. డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్ నాటికి రూర్క్ పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులోకి వస్తాడని వాల్టర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. భారత్‌తో జరిగే ప్రతిష్ఠాత్మక సిరీస్‌కు విల్ రూర్క్ దూరం కావడం తమని తీవ్ర నిరాశపరిచిందన్నాడు. అయితే అతడు ప్రస్తుతం రెండు గాయాలతో బాధపడుతున్నాడని, పూర్తిగా కోలుకోవడానికి మరింత సమయం ఇవ్వాలని నిర్ణయించామని వాల్టర్ వెల్లడించాడు. భారత్‌తో సిరీస్ తర్వాత ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టులు ఆడనున్నామని, ఆ సిరీస్ నాటికి రూర్క్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని భావిస్తున్నామని వాల్టర్ పేర్కొన్నాడు.మరోవైపు రూర్క్‌కు టెస్టుల్లో అద్భుతమైన రికార్డు ఉంది. 2024లో అంతర్జాతీయ క్రికెట్ లోకి అరంగేట్రం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 14 టెస్టులు మాత్రమే ఆడిన ఓరూర్క్.. 49 వికెట్లు సాధించాడు. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో అతడు 10 వికెట్లు తీశాడు. అయితే ఆ సిరీస్‌లోని చివరి టెస్టులో అతడు కాలి కండరాల గాయానికి గురయ్యాడు. అప్పటి నుంచి అతడు ఆటకు దూరంగా ఉంటున్నాడు. అంతకుముందు వెన్ననొప్పి కారణంగా ఏడు నెలల పాటు రూర్క్ ఆటకు దూరంగా ఉన్నాడు. ఇంగ్లాండ్‌పై 2-1తో న్యూజిలాండ్ సిరీస్ గెలవడంలో రూర్క్ కీలక పాత్ర పోషించాడు.

ఆ తప్పే వల్లే మ్యాచ్ కోల్పోయాం: సునీల్ గావస్కర్



రాంచీ వేదికగావెస్టిండీస్‌తో జరిగిన హై-స్కోరింగ్ మ్యాచ్‌లో భారత జట్టు 249 పరుగుల భారీ స్కోరు సాధించినప్పటికీ విజయం సాధించలేదు. ఈ ఓటమిపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. అలానే ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ సేన వ్యూహాలపై ఆయన కొన్ని కీలక విమర్శలు గుప్పించారు. మ్యాచ్‌ను ప్రత్యర్థి కైవసం చేసుకోవడానికి చివరి దశలో తీసుకున్న కొన్ని నిర్ణయాలే కారణమని గావస్కర్ అభిప్రాయపడ్డారు.ఓ స్పోర్ట్స్ ఛానల్ ఇంటర్వ్యూలో సునీల్ గావస్కర్ మాట్లాడుతూ... మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచిన కీలకమైన 17వ ఓవర్‌ను స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు ఇవ్వడం పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. ఆ ఓవర్‌లో విండీస్ బ్యాటర్లు విరుచుకుపడి 24 పరుగులు రాబట్టారు. ఆ తర్వాత వచ్చిన అర్ష్‌దీప్ సింగ్ వేసిన 18వ ఓవర్‌లోనూ 17 పరుగులు రావడంతో మ్యాచ్ పూర్తిగా కరీబియన్ల చేతుల్లోకి వెళ్లింది. చివరకు 19వ ఓవర్‌లోనే విండీస్ లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది.ఆ పరిస్థితులపై కూడా గావస్కర్ స్పందిస్తూ.. 'ఆ సమయంలో కుల్‌దీప్‌కు బదులుగా మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ తో బౌలింగ్ వేయించి ఉండే బాగుండేది. అప్పటికే మూడు వికెట్లు తీసి మంచి ఊపుమీదున్న మయాంక్‌ను కీలక సమయంలో బౌలింగ్‌కు దించి ఉంటే ఫలితం వేరేలా ఉండేది' అని గావస్కర్ అభిప్రాయపడ్డారు. అలాగే ఇన్నింగ్స్ ప్రారంభంలో(9వ ఓవర్లో) శివమ్ దూబేకు బౌలింగ్ ఇవ్వడం కూడా సరికాదని, బ్యాటర్లు క్రీజులో కుదురుకుంటున్న ఆ సమయంలో కుల్‌దీప్‌ను రంగంలోకి దింపి ఉండాల్సిందని ఆయన సూచించారు. భారీ స్కోరు చేసినా బౌలింగ్ మార్పుల్లో జరిగిన పొరపాట్ల వల్లే భారత్ పరాజయాన్ని చవిచూసిందని గావస్కర్ విశ్లేషించారు.

షమీకి జట్టులో చోటు దక్కుతుందని అనుకోవడం లేదు: ఆకాశ్ చోప్రా



టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ మళ్లీ భారత జట్టులోకి వస్తాడా? 2027 వన్డే ప్రపంచకప్ ఆడే అవకాశం దక్కించుకుంటాడా? ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మారిన తర్వాత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ జట్టులోకి తిరిగి రావడంతో షమీ పునరాగమనంపై కూడా ఆశలు పెరిగాయి. అయితే మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా మాత్రం షమీ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశాడు.'అజిత్ అగార్కర్ మాత్రమే షమీ రీఎంట్రీకి అడ్డుపడుతున్నాడని వార్తలు వస్తున్నాయి. మిగతా సెలెక్టర్లు షమీని ఎంపిక చేయాలనుకున్నారని భావిస్తే మనల్ని మనమే మోసం చేసుకున్నట్లు అవుతుంది. సెలక్షన్ కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. నేను సెలక్టర్లతో మాట్లాడాను. వారందరి అభిప్రాయం ఒక్కటే. అగార్కర్ మాత్రమే ఈ నిర్ణయం తీసుకున్నారని, మిగతావారంతా దానికి అంగీకరించారని అనుకోవడం సరికాదు.న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు షమీ పేరును పరిశీలిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. అతడికి అవకాశం రావచ్చనే వార్తలను నేను కొట్టిపారేయడం లేదు. కానీ అగార్కర్ వెళ్లిపోయారు కాబట్టి షమీకి జట్టులో చోటు దక్కుతుందని మాత్రం నేను అనుకోవడం లేదు. 2027 ప్రపంచకప్‌లో ఆడాలంటే ఇదే అతడికి కీలకమైన అవకాశం. ఇప్పుడు కాకపోతే ఆ తర్వాత ఎప్పుడు?. అయితే షమీ తిరిగి జట్టులోకి వస్తాడా? రాడా? అనే విషయంపై నాకు కూడా అంతర్గతంగా ఎలాంటి సమాచారం లేదు' అని ఆకాశ్ చోప్రా వెల్లడించాడు.ప్రస్తుతం భారత జట్టు పేస్ విభాగంలో పలు సమస్యలు ఉన్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా పనిభారాన్ని ఎలా నిర్వహించాలన్నది జట్టు యాజమాన్యానికి సవాలుగా మారింది. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, హార్దిక్ పాండ్య గాయాల సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. న్యూజిలాండ్ పర్యటనలో ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడాల్సి ఉండటంతో బౌలర్ల ఎంపిక కీలకంగా మారనుంది. ప్రస్తుతం షమీకి టీ20 జట్టులో చోటు లేదు. అయితే వన్డే జట్టులోకి వస్తాడా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. న్యూజిలాండ్ పర్యటనకు భారత వన్డే జట్టును అక్టోబర్ మధ్యలో ప్రకటించే అవకాశం ఉంది. అప్పుడే షమీ భవితవ్యంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

పరుగులు చేయలేకపోయినా పూర్తి బాధ్యత నాదే: సంజు శాంసన్



పరుసగా నాలుగు ఇన్నింగ్స్‌లలో విఫలమైనా.. తనపై నమ్మకం కోల్పోలేదని టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ సంజు శాంసన్ స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో రెండో టీ20లో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో విమర్శకులకు బ్యాట్‌తోనే సమాధానమిచ్చాడు. రాంచీ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 41 బంతుల్లో 82 పరుగులు చేసి తన సత్తా చాటాడు. అయితే జట్టు భారీ స్కోరు చేసినప్పటికీ విజయం సాధించలేకపోవడం అభిమానులను నిరాశపరిచింది. ఈ క్రమంలో సంజు తన ఆటపై పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.వెస్టిండీస్‌తో రెండో టీ20 ముగిసిన అనంతరం.. గత నాలుగు ఇన్నింగ్స్‌లతో పోలిస్తే ఈసారి మెరుగైన ప్రదర్శన చేయడానికి కారణమేంటనే ప్రశ్న సంజుకు ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో స్పందించాడు. 'ప్రొఫెషనల్ క్రికెటర్‌గా భారత్ తరఫున ఆడుతున్నప్పుడు నా బాధ్యతలను నేను సక్రమంగా నిర్వర్తించాలి. అందుకోసం అవసరమైన సన్నద్ధత, ప్రాక్టీస్, శిక్షణ.. నా చేతుల్లో ఉన్న ప్రతిదీ చేస్తాను. కానీ ఈ ఫార్మాట్‌లో ఫలితం ఎప్పుడూ మన చేతుల్లో ఉండదు. అందుకే వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యానని చెప్పి.. తర్వాతి ఇన్నింగ్స్‌లో నెమ్మదిగా ఆడి ఫామ్ అందుకోవాలని అనుకోలేం. నేను పరుగులు చేయలేకపోతే ఆ బాధ్యత నాదే. అందుకు మరెవరినీ నిందించను. మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ పరుగులు చేయడమే నా పని. దాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను' అని సంజు వెల్లడించాడు.

సుదీర్ఘ అనుబంధానికి స్వస్తి.. బ్యాటింగ్ కోచ్ హస్సీకి సీఎస్కే గుడ్ బై!

ఐపీఎల్‌లో ఐదు టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రధాన కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను నియమించిన ఆ ఫ్రాంచైజీ.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జట్టుతో 15 ఏళ్లకు పైగా అనుబంధం ఉన్న ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీకి వీడ్కోలు పలికినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు సహాయక సిబ్బందిలో భారీ మార్పులు చేపడుతున్న సీఎస్కే.. ఇప్పటికే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, బౌలింగ్ కోచ్ ఎరిక్ సైమన్స్‌తోనూ బంధాన్ని తెంచుకున్న సంగతి తెలిసిందే.మైఖేల్ హస్సీని కొనసాగించకూడదన్న నిర్ణయాన్ని సీఎస్కే యాజమాన్యం ఆయనకు అధికారికంగా తెలియజేసినట్లు సమాచారం. అయితే, హస్సీ ఐపీఎల్ 2027లో మరో ఫ్రాంచైజీ సహాయక సిబ్బందిలో చేరే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని జట్లతో ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే సీజన్‌లో హస్సీ ఏ జట్టు డగౌట్‌లో కనిపిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.ఐపీఎల్ 2027కు ముందు సీఎస్కే తన కోచింగ్ బృందాన్ని పూర్తిగా మార్చే పనిలో ఉన్నట్లు కనిపిస్తోంది. తాజాగా జహీర్ ఖాన్‌ను ప్రధాన కోచ్‌గా నియమించడంతో పాటు.. సీఎస్కే మాజీ పేసర్ మోహిత్ శర్మకు బౌలింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. మరోవైపు ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ ఫోస్టర్ భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా మారినట్లు సమాచారం. హస్సీ స్థానంలో బ్యాటింగ్ కోచ్‌గా ఎవరిని నియమిస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. సీఎస్కేలో జరుగుతున్న ఈ మార్పుల వెనుక ఆ జట్టు దిగ్గజ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. జట్టు భవిష్యత్తు ప్రణాళికలు, కోచింగ్ సిబ్బంది ఎంపికలో ఆయన సూచనలు కీలకంగా మారినట్లు తెలుస్తోంది. అయితే, ఈ మార్పులపై ఫ్రాంచైజీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మైఖేల్ హస్సీకి సీఎస్కేతో నుదీర్ఘ అనుబంధం ఉంది. ఆటగాడిగా జట్టుతో రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన ఆయన.. కోచ్‌గా మరో మూడు టైటిళ్లలో భాగమయ్యాడు. తొలి ఐపీఎల్ సీజన్లలో సీఎస్కే బ్యాటింగ్ విభాగానికి వెన్నెముకగా నిలిచాడు. 2013 ఐపీఎల్ సీజన్‌లో ఏకంగా 733 పరుగులు సాధించి తన సత్తా చాటాడు. ఆటగాడిగా జట్టుకు సేవలందించిన హస్సీ.. ఆ తర్వాత బ్యాటింగ్ కోచ్‌గా కూడా కీలక పాత్ర పోషించాడు. అలాంటి వ్యక్తితో సీఎస్కే బంధం ముగియడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐపీఎల్ 2027కు ముందు కోచింగ్ సిబ్బందిలో ఇన్ని మార్పులు చేపడుతున్న నేపథ్యంలో.. కొత్త బృందంతో చెన్నై సూపర్ కింగ్స్ ఎలాంటి ఫలితాలు సాధిస్తుందో చూడాలి.



టెస్టు క్రికెట్ చరిత్రలోనే తొలిసారి.. ఆసీస్ జట్టులో అందరూ 30 ఏళ్లు దాటినవారే!

ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని జట్టుగా పేరున్న ఆస్ట్రేలియాకు బ్యాటింగ్ సమస్యలు వెంటాడుతున్నాయి. దక్షిణాఫ్రికాతో దర్బన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆ ఓ అరుదైన రికార్డు నమోదు చేసింది. అయితే ఇది గొప్ప ఘనతేమీ కాదు! టెస్టు క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా 30 ఏళ్లు దాటిన 11 మంది ప్లేయర్లతో ఆసీస్ బరిలోకి దిగింది. యువ ప్లేయర్ల కొరతకు ఇది అద్దం పడుతుందంటూ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఆస్ట్రేలియా 1877లో తొలి టెస్టు మ్యాచ్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా దర్బన్ టెస్టులో ఆ జట్టు మొత్తం 30 ఏళ్లు దాటిన ఆటగాళ్లతో బరిలోకి దిగింది. ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ గాయంతో దూరం కావడంతో 30 ఏళ్ల మ్యాట్ రెన్షా జట్టులోకి వచ్చాడు. మరోవైపు 34 ఏళ్ల నిక్ మాడిన్సన్‌కు కూడా అవకాశం కల్పించారు. దాదాపు పదేళ్ల విరామం తర్వాత మాడిన్సన్ టెస్టు జట్టులోకి తిరిగి వచ్చాడు. వీరిద్దరూ స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్, అలెక్స్ క్యారీ వంటి సీనియర్ ఆటగాళ్లతో కలిసి ఆడుతున్నారు. దీంతో ఆసీస్ టెస్టు జట్టు మొత్తం 30 ఏళ్లు దాటిన ఆటగాళ్లతోనే నిండిపోయింది.ఆస్ట్రేలియా జట్టులో యువ ఆటగాళ్లు టెస్టు స్థాయిలో తమ స్థానాన్ని పదిలం చేసుకోలేకపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఉస్మాన్ ఖవాజా స్థానాన్ని భర్తీ చేసే సరైన ఓపెనర్ కోసం ఆసీస్ ఇంకా అన్వేషిస్తోంది. మరోవైపు మార్నస్ లబుషేన్ వంటి ఆటగాళ్లు కొంతకాలంగా ఫామ్ కోల్పోయినా జట్టులో కొనసాగుతున్నారు. స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ అప్పుడప్పుడు రాణిస్తున్నా.. మిగతా బ్యాటర్ల నుంచి స్థిరమైన ప్రదర్శన రావడం లేదు. దీంతో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలా? లేక అనుభవజ్ఞులపైనే నమ్మకం ఉంచాలా? అన్న సందిగ్ధంలో జట్టు యాజమాన్యం ఉన్నట్లు కనిపిస్తోంది.





సినిమా



వారణాసిలో మరో సర్‌ప్రైజ్..



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న వారణాసి పై రోజురోజుకూ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. రాజమౌళి గత చిత్రాలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నంగతి తెలిసిందే. అయితే వారణాసి విషయంలో మాత్రం ఆయన మరింత భారీగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, ప్రపంచ నిర్మాణం ఇలా ప్రతి అంశంలోనూ కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని టాక్. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. వారణాసిలోని కొన్ని కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకమైన భాషను, లిపిని రూపొందించినట్లు సమాచారం.కథలోని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని మరింత సహజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా చూపించేందుకు ఈ కొత్త భాషను ఉపయోగించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి గతంలో బాహుబలి కోసం కిలికి అనే ప్రత్యేక భాషను సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలోని కల్పిత ప్రపంచానికి తగ్గట్టుగా ఆ భాషను రూపొందించడం అప్పట్లో ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు వారణాసి కోసం కూడా అలాంటి ప్రయోగమే చేస్తున్నారనే వార్త సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. అయితే ఈ కొత్త భాష సినిమాలో ఏ సందర్భంలో వినిపించనుంది.? దాని వెనుక ఉన్న ప్రపంచం ఏమిటి.? మహేష్ బాబు పాత్రకు దీనికి ఉన్న సంబంధం ఏంటి.? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉన్నాయి. మొత్తానికి రాజమౌళి వారణాసిని సాధారణ అడ్వెంచర్ సినిమాగా కాకుండా, భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లేలా రూపొందిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, వరుసగా బయటకు వస్తున్న ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు ప్రేక్షకుల్లో అంచనాలను భారీగా పెంచుతున్నాయి.

అతనికి నేను ఒకే చెప్పేశా..

టాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టి దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న నటి అనుష్క శెట్టి. గ్లామర్ పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ముఖ్యంగా అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి, భాగమతి వంటి సినిమాలు అనుష్కకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే సినిమాల్లో ఎంత పాపులారిటీ ఉన్నప్పటికీ.. వ్యక్తిగత విషయాల విషయంలో మాత్రం అనుష్క చాలా ప్రైవేట్‌గా ఉంటారు. తన వ్యక్తిగత జీవితం గురించి పెద్దగా మాట్లాడేందుకు ఇష్టపడని ఈ స్వీటీ.. అప్పుడప్పుడు ఇంటర్వ్యూల్లో తన జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటుంటారు. అలాంటి ఓ సందర్భంలో ఆమె చెప్పిన చిన్ననాటి ప్రేమ జ్ఞాపకం ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్న అనుష్క.. తాను ఆరో తరగతిలో ఉన్నప్పుడు జరిగిన ఓ నరదా సంఘటనను పంచుకున్నట్లు సమాచారం. ఓ అబ్బాయి తన దగ్గరకు వచ్చి నేరుగా 'ఐ లవ్ యు' అని చెప్పాడట. అయితే అప్పటికి ప్రేమ అంటే ఏమిటో, 'ఐ లవ్ యు' అనే మాటకు అసలు అర్థం ఏమిటో కూడా తనకు తెలియదని అనుష్క చెప్పుకొచ్చారు. ఆ మాట విన్న వెంటనే ఏం చేయాలో తెలియక అమాయకంగా 'సరే' అని చెప్పేశానని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులో జరిగిన ఆ సంఘటనను ఇప్పుడు తలుచుకుంటే చాలా అమాయకంగా, అందంగా అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. తన బాల్యంలో మిగిలిపోయిన మధురమైన జ్ఞాపకాల్లో అదొకటని చెప్పడంతో.. అనుష్క అభిమానులు కూడా ఈ విషయాన్ని ఆనక్తిగా షేర్ చేస్తున్నారు.అనుష్క వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వార్తలు, ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె వివాహం ఎప్పుడు జరుగుతుంది.? ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు.? అనే ప్రశ్నలు అభిమానుల్లో చాలాకాలంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అదే సమయంలో ఓ పాన్ ఇండియా హీరోతో అనుష్కకు



ప్రేమ నంబంధం ఉందంటూ గతంలో పలు సందర్భాల్లో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అలాంటి ప్రచారాలపై ఇద్దరూ పలుమార్లు స్పందిస్తూ తాము మంచి స్నేహితులమని స్పష్టం చేసిన సందర్భాలు ఉన్నాయి. సినిమాల్లోకి రాకముందు అనుష్క ముంబైలో యోగా శిక్షకురాలిగా పనిచేశారు. ఆ సమయంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ దృష్టిలో పడటంతో.. నాగార్జున హీరోగా తెరకెక్కిన 'సూపర్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత వరుస సినిమాలతో దూసుకుపోతుంది.

'భారతీయుడు 3 పోస్టర్ విడుదల

విశ్వనటుడు కమల్ హాసన్, అగ్ర దర్శకుడు శంకర్ కాంబోలో వచ్చిన సినిమా 'ఇండియన్'. తెలుగులో 'భారతీయుడు' పేరుతో విడుదలైంది. 1996లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం సాధించింది. దీనికి కొనసాగింపుగా 2024లో 'భారతీయుడు 2' (ఇండియన్ 2) సినిమా వచ్చింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం.. డిజాస్టర్ గా మారింది. దీంతో పార్ట్-3 ఉంటుందా లేదా? అనే దానిపై గత రెండేళ్లుగా సందిగ్ధత నెలకొంది. దీనికి తెర దించుతూ మేకర్స్ ఉన్నట్టుండి 'ఇండియన్ 3' సినిమాపై కీలక అప్డేట్ అందించారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' అనే పేరుతో లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ గురువారం ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇందులో ముగ్గురు గుర్రపు వ్యక్తులు స్వారీతో దుమ్మురేపుతూ దూసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. "ఇండియన్-3 వార్ మోడ్‌లో పునరాగమనం మొదలవుతుంది.. ఏమాత్రం సహనం లేకుండా తిరిగి వస్తున్న సేనాపతి ఈసారి ఎవ్వరినీ ఉపేక్షించడు" అని పేర్కొన్నారు. ఈ సినిమా హిందీలో 'హిందుస్థాని 3', తెలుగులో ' భారతీయుడు 3 ' పేర్లతో వస్తుందని క్లారిటీ ఇచ్చారు. 'భారతీయుడు 2' సినిమాలో కమల్ హాసన్ తో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య, ప్రియా భవానీ శంకర్, బాబీ సింహా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వీరితో పాటుగా కాజల్ అగర్వాల్ కూడా 'భారతీయుడు 3' చిత్రంలో భాగమయ్యారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. రవి వర్మన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు కానీ, సినిమాని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారనేది మేకర్స్ వెల్లడించలేదు.

'రణబాలి' ట్రైలర్ వచ్చేసింది!



విజయ్ దేవరకొండ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'రణబాలి' సినిమా దసరా కానుకగా థియేటర్లలోకి రానుంది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ మూవీలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, టీజర్, ఫస్ట్ సాంగ్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. ఇటీవల వచ్చిన డాక్యు సిరీస్ కూడా మంచి హైప్ తెచ్చి పెట్టింది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. 3 నిమిషాల 47 సెకండ్ల నిడివితో వచ్చిన 'రణబాలి' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించారు. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటించారు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ విలన్ పాత్ర పోషిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చారు. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా కావడం.. భార్యాభర్తలుగా మారిన తర్వాత వస్తున్న తొలి సినిమా కావడంతో అభిమానులు ప్రత్యేకంగా భావిస్తున్నారు. అక్టోబర్ 16న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానుంది.



ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి..!

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి..!

ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

నార్పల,అక్టోబర్ 10:-(తెలుగు కలం):-ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (ఎఫ్) ప్రక్రియను రద్దు చేయాలని,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని,ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నార్పల మండల కేంద్రంలో రైతు,వ్యవసాయ కార్మిక,కౌలు రైతు సంఘాలు, సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించే పరిస్థితులు ఏర్పడితే ప్రజా స్వామ్య హక్కులకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన కీలకమైన హక్కు అని,అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా జరగాలని,ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం స్పష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఐదు ప్రధాన డిమాండ్లుచీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని,ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపును వెంటనే నిలిపివేయాలని, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కును పరిరక్షించాలని, ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో సీపీఎం మండల నాయకులు ఎం.ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వై. ఏర్నాగప్ప,టి.రాజశేఖర్,కె. నాగరాజు,చేనేత కార్మిక సంఘం నాయకులు ఇల్లూరు రామాంజ నేయులు,ఐద్వా మండల నాయకురాలు,సీఐటీయూ నాయకులు రామాంజ నేయులు,సీనియర్ నాయకులు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, (తెలుగు కలం) అక్టోబర్ 10:-త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం కర్నూలు నగర శివార్లలోని అథేనా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్...ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, సిబ్బంది రాకపోకలు, రిసెప్షన్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సామగ్రి భద్రపరచడం, పంపిణీ చేయడం వంటి ప్రక్రియల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సంబంధిత అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశించారు.పర్యటనలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్నికల్లో విజయం TWU కూటమికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



గోదావరిఖని (తెలుగు కలం) అక్టోబర్-10గోదావరిఖని ఆర్టీసీ డిపోలో ఈరోజు నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంప్లాయీస్ యూనియన్ కూటమి నాయకులు, సభ్యులు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఎన్నికల్లో విజయం సాధించిన ఎంప్లాయీస్ కూటమి నాయకులకు, సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ కూటమి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

రేషన్ స్టాక్ అడిగితే నాపైనే చర్యలా అధికారుల హెచ్చరికలపై డీలర్ సుదర్శన్ రెడ్డి ఆవేదన

డోన్,(తెలుగు కలం) అక్టోబర్ 10 :-డోన్ మండల పరిధిలోని వలసల గ్రామ రేషన్ డీలర్ సుదర్శన్ రెడ్డి రేషన్ స్టాక్ వ్యవహారంలో అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన మిగిలిన రేషన్ నిల్వలను అప్పగించాలని కోరితే, తనపైనే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారని ఆయన ఆరోపించారు. సుదర్శన్ రెడ్డి గత 16 సంవత్సరాలుగా రేషన్ డీలర్‌గా కొనసాగుతున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తనపై అధికారులు ఒత్తిడి తీసుకువచ్చారని, ఈ ఏడాది మే నెలలో తనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. దీంతో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా, తిరిగి డీలర్‌గా కొనసాగేందుకు అనుకూలంగా ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను సంబంధిత ఆర్డీవోకు అందజేయగా, వెంటనే డీలర్‌గా కొనసాగాలని ఆదేశించినట్లు వివరించారు.నామినీ వద్ద ఉన్న స్టాక్‌పై వివాదంగత నాలుగు నెలలుగా పొదుపు మహిళా సంఘ సభ్యురాలు వి. పెద్దలమ్మ పేరు మీద స్వయం సహాయక సంఘం ద్వారా సుధాకర్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. తిరిగి తాను డీలర్‌గా కొనసాగాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో, సుధాకర్ వద్ద ఉన్న రేషన్ నిల్వలను గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) సమక్షంలో తనకు అప్పగించాలని అధికారులు సూచించినట్లు చెప్పారు.ఈపాస్ యంత్రంలో నమోదైన వివరాల ప్రకారం సుమారు 14 క్వింటాళ్ల 80 కిలోల బియ్యం, 157 కిలోల జొన్నలు, 32 ప్యాకెట్ల చక్కెర నిల్వలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, తనకు 6 క్వింటాళ్ల బియ్యం, 100 కిలోల జొన్నలు, 20 ప్యాకెట్ల చక్కెర మాత్రమే అందజేశారని తెలిపారు.ఇంకా 8 క్వింటాళ్ల 80 కిలోల బియ్యం, 57 కిలోల జొన్నలు, 12 ప్యాకెట్ల చక్కెర అందాల్సి ఉందని, ఈ మిగిలిన నిల్వలను అప్పగించాలని అధికారులను కోరినట్లు సుదర్శన్ రెడ్డి వివరించారు.మిగిలిన స్టాక్ ఎక్కడ?మిగిలిన రేషన్ నిల్వల గురించి ప్రశ్నించినప్పుడు అధికారులు తనపై ఆగ్రహం వ్యక్తం చేశారని, మిగిలిన స్టాక్‌ను కూడా తనే ఏదో విధంగా సమకూర్చుకుని ప్రజలకు పంపిణీ చేయాలని హెచ్చరించినట్లు సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈపాస్ యంత్రంలో నమోదైన నిల్వలకు, తనకు అప్పగించిన రేషన్ స్టాక్‌కు మధ్య వ్యత్యాసం ఉన్నప్పుడు ఆ నిల్వల వివరాలను పరిశీలించి, బాధ్యులెవరో తేల్చాలని ఆయన కోరుతున్నారు. తనకు అందని రేషన్ నిల్వల బాధ్యతను తనపై వేయడం సరికాదని పేర్కొన్నారు.రేషన్ నిల్వల వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, ఈపాస్ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సుదర్శన్ రెడ్డి కోరుతున్నారు.



నార్పల గ్యాస్ ఏజెన్సీపై ప్రజల ఆగ్రహం..!

గ్యాస్ సిలిండర్ మోసే బాధ్యత కూడా వినియోగదారులదేనా..?

ఇంటి వద్దకు డెలివరీ ఏదీ..? ఆటో నుంచి సిలిండర్ దించుకోవాల్సిందేనా..?

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్:



నార్పల,అక్టోబర్ 10:-(తెలుగు కలం):-గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుంటే ఇంటి వద్దకు వచ్చి అందించాల్సిన సిలిండర్ కోసం వినియోగదారులే నార్పల గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తీరా సిలిండర్ ఆటోలో ఉండగా దానిని కిందకు దించి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా తమపైనే పడుతోందని వాపోతున్నారు.ఆటో డ్రైవర్ కానీ,ఏజెన్సీ సిబ్బంది కానీ సహకరించకపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆరోపిస్తున్నారు.సిలిండర్ కోసం ఇన్ని కష్టాలా.. ఇదెక్కడి న్యాయం..?గ్యాస్ సిలిండర్లను ఇళ్ల వద్దకు డెలివరీ చేయకుండా కార్యాలయం వద్ద కూడా కాదు ఏకంగా నార్పల ఊరి చివర ఉన్న గోడౌన్ వద్దకే రావాలని చెబుతున్నారని,రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవించే పేదలు తమ పనులను వదులుకొని సిలిండర్ల కోసం సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.గ్యాస్ కొనుగోలు చేయడమే కాకుండా దానిని మోసుకెళ్లే భారం కూడా మాపైనేనా..? అంటూ ప్రశ్నిస్తున్నారు.అదనపు వసూళ్లపై ఆరోపణలు..?డిజిటల్ చెల్లింపులకూ ఇబ్బందులేనా..?గ్యాస్ సిలిండర్ పంపిణీలో అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారని,చిల్లర తిరిగి ఇచ్చే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని,ఫోన్‌పే వంటి డిజిటల్ చెల్లింపులు స్వీకరించకుండా నగదు మాత్రమే అడుగుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.ఈ సమస్యలపై గతంలోనూ ఎన్నో సార్లు పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ ఏజెన్సీ యాజమాన్యం స్పందించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు.. ఆధారాలతో సిద్ధమైన బీజేపీనార్పల గ్యాస్ ఏజెన్సీలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్ తెలిపారు. బాధితుల సంతకాలతో పాటు ఫోటోలు,వీడియోలను ఆధారాలుగా సమర్పించి,వచ్చే సోమవారం నిర్వహించే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.గ్యాస్ డెలివరీలో జరుగుతున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై విచారణ జరిపి,నిబంధనల ప్రకారం సిలిండర్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.మా బాధ ఎవరికి చెప్పుకోవాలి?గ్యాస్ సిలిండర్ కోసం పనులు మానుకొని కార్యాలయం చుట్టూ తిరగడం,తీరా సిలిండర్ వచ్చినా దానిని స్వయంగా దించుకొని తీసుకెళ్లడం తమకు నిత్యకృత్యంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు.తమ సమస్యలపై ఎన్నిసార్లు వార్తలు వచ్చినా యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఏజెన్సీ నిర్వహణపై విచారణ జరిపి వినియోగ దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. యాజమాన్యం ఎప్పుడు స్పందిస్తుంది..?అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయి..?అన్న ప్రశ్నలకు సమాధానం కోసం నార్పల మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.





ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్

హైదరాబాద్,తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురు దెబ్బ తాకింది. స్వయానా రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీల వర్షం కురిపించినా, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రచారం చేసినా, ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన కూటమిని లైట్ తీసుకున్నారు.శుక్రవారం న్న జరిగిన తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కూటమి ఘన విజయం సాధించింది.కాంగ్రెస్ మద్దతిచ్చిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూయూ) కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కానీ, అనుబంధ కార్మిక సంఘం కానీ ఎవరికి మద్దతు ఇవ్వలేదు. బడా నేతలు ప్రచారం చేసినా కూడా గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి చుక్కెదురవ్వడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.

PRINTED AND PUBLISHED BY : D.NO. 25/714, HAVANNA PET, MARKENDEYA SWAMY TEMPLE, ADONI (TOWN & POST), KURNOOL, ANDHRA PRADESH - 518301.